క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామి వారు

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని వివిధ పుష్పాలు, తులసీదళాలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేకపూజలతో పాటు సహస్రదీపాలంకరణ సేవ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం



ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడికి నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి జి.అగ్రహారం గ్రామానికి చెందిన అంధవరపు రాజేశ్వరరావు, లక్ష్మీ దంపతుల కుమారులు, కుమార్తెలు, కోడలు, అల్లుడు కలిపి రూ.65 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆలయ నిర్మాణం వద్ద ఆలయ కమిటీ సభ్యుడు కోట్ల లక్ష్మణరావుకు శనివారం నగదు అందజేశారు.

వసతిగృహానికి క్రీడా సామగ్రి వితరణ



బాలికలకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంఈఓలు శ్రీదేవి,శ్రీనివాసరావు,జర్నలిస్టులు

కొత్తవలస: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పీపుల్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ బాలికల వసతి గృహానికి ఎంఈఓలు జి.శ్రీదేవి,బి.శ్రీనివాసరావు చేతుల మీదుగా శనివారం క్రీడాసామగ్రి అందజేశారు.ముందుగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడా సామగ్రి సమకూర్చిన విలేకరులను ఎంఈఓలు అభినందించారు. వార్డెన్ నీరజ, జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్ష,ఉపాధ్యక్షులు విశ్వనాథ హరికుమార్, కాకర శ్రీనివాస్, సభ్యులు మొయ్యి గణేష్, రావలపూడి గోవింద, గాడి ప్రసాద్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



వర్క్‌షాప్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శృంగవరపుకోట: అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణపై ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగి సింది. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంచేలా ప్రయోగాలు చేయించడంపై ఉపాధ్యాయులకు వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించారు. రిమోట్ కార్ల తయారీ, ఆటోమేటిక్ వాటర్‌శానిటేషన్ వంటి ప్రాజెక్టులను లెండి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించారు. సైబర్ సెక్యూరిటీపై కె.మోహన్‌వంశీ ప్రసంగించారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

బొలేరో వ్యాన్ బోల్తా



రోడ్డు మధ్యలో బోల్తాపడిన బొలేరా వ్యాన్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం చర్చి వీధి దగ్గర జాతీయ రహదారిపై ఆర్‌ఓబీ పనుల్లో భాగంగా తాత్కాలికంగా నిర్మించిన రోడ్డుపై గడ్డి లోడుతో బొలేరో వ్యాన్ శనివారం బోల్తా పడింది. రామభద్రాపురం నుంచి విజయనగరం గడ్డి లోడుతో వెళ్తున్న బొలేరా వాహనం రోడ్డు మధ్యలో ఉన్న గోతుల వల్ల అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. స్థానికులు సహాయంతో గడ్డిని అన్‌లోడ్ చేసి వ్యాన్‌ను బయటకు తీసి మళ్లీ లోడ్ చేసి పంపించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



గజపతినగరం: బాలుర హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి కనకలక్ష్మి



గుర్ల: పెదబంటుపల్లి ఉన్నత పాఠశాలలో నాటేందుకు సిద్ధం చేసిన మొక్కలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



వేపాడ: బొద్దాం ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): కోనూరు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ రామారావు, సర్పంచ్ శ్రీరాములు, ఉపాధ్యాయులు



దత్తిరాజేరు: రామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న అమ్మసేవ ఫౌండేషన్ సభ్యులు



శృంగవరపుకోట: కొత్తూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

గజపతినగరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.కనక లక్ష్మి పిలుపునిచ్చారు. జాతీయ నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శనివారం పర్యావరణ క్లబ్ కార్యక్రమం పేరిట స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. హెచ్ఎం ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అమ్మ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

దత్తిరాజేరు: రామచంద్రాపురం ఉన్నత పాఠశాల, షికారుగంజి మోడల్ స్కూల్ ప్రాంగణాల్లో అమ్మ సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు దేవారపు సురేష్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యరహిత పర్యా వరణాన్ని నిర్మించి రేపటి సమాజానికి ఆదర్శంగా నిలబడాలని అన్నారు. తమసంస్థ ద్వారా కొన్నేళ్లుగా పేద విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, రామచంద్రాపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వనమహోత్సవం

గుర్ల: పెదబంటుపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు కంది వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో 248 మంది విద్యార్థులు ఒక్కొ క్కరూ రెండు మొక్కలు చొప్పున ,15 మంది ఉపాధ్యాయులు రెండేసి చొప్పున మొక్కలు నాటారు. ఈమొక్కల సంరక్షణకు టీమ్‌లను నియమించారు.

మొక్కలతో ఆహ్లాదకర వాతావరణం

చీపురుపల్లిరూరల్(గరివిడి): మొక్కల పెంపకంతో పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఎంఈఓ పి.రామారావు, సర్పంచ్ బూడి శ్రీరాములు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గరివిడి మండలంలోని కోనూరు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ మూర్తి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ సత్యవతి, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొద్దాం, జాకేరులో..

వేపాడ: మండలంలోని బొద్దాం, జాకేరు ప్రాథమిక పాఠశాలల ఆవరణలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు శనివారం మొక్కలు నాటారు. ఈ మొక్కలను గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్(జియో) వ్యవస్థాపకుడు రామకృష్ణ అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.

అమ్మ పేరుతో ఓ మొక్క నాటుదాం

శృంగవరపుకోట: స్థానిక గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఏక్ పేడ్ మాకే నామ్ పర్ అంటూ మొక్కలు నాటే కార్యక్రమం శనివారం నిర్వహించింది. తల్లి పేరుతో ఒక్క మొక్క నాటండి అన్ననినాదంతో ఇటు ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులను ప్రోత్సహిస్తోంది. ఎంఈఓ నర్సింగరావు సూచనల మేరకు కొత్తూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. హెచ్ఎం వి.ఎస్.దేముడు, పంచాయతీ కార్యదర్శి వి.రవి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌ల కార్యవర్గాల ఎన్నిక



లయన్స్ స్టార్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన విష్ణుమూర్తికి బాధ్యతలు అప్పగిస్తున్న పూర్వగవర్నర్ శర్మ

చీపురుపల్లి: పట్టణంలోని లయన్స్‌క్లబ్ హాల్‌లో 2024–25 సంవత్సరానికి సంబంధించి లయన్స్ స్టార్స్ క్లబ్, లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాల ఎన్నిక శుక్రవారం రాత్రి నిర్వహించారు. రెండు క్లబ్‌ల నూతన కార్యవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. లయన్స్ స్టార్స్ క్లబ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గంట్యాడ విష్ణుమూర్తి, కార్యదర్శిగా సూరు కిరణ్, కోశాధికారిగా విజనగిరి మహేష్, అలాగే లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా డి.సీతారామరాజు, కార్యదర్శిగా కోరాడ శంకరరావు, కోశాధికారిగా కందుల నాగశంకర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్, గరివిడి ఫేకర్ సీఈఓ ఎం.ఎస్.ఎస్.శర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరించాలని సూచించారు. యువత లయన్స్‌క్లబ్‌లోకి రావడం ద్వారా మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని, లయన్స్ క్లబ్ సభ్యత్వాలను వేగవంతం చేయాలని సూచించారు. క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, సూరు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోండి
  – ప్రిన్సిపాల్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి

చీపురుపల్లి: స్థానిక జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో వివిధ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 29లోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని సూచించారు. పాలిసెట్‌లో ర్యాంక్ వచ్చినా, క్వాలిఫై అవ్వకపోయినా సరే స్పాట్ అడ్మిషన్‌కు రావొచ్చని, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ప్రతి ఒక్కరూ స్పాట్ అడ్మిషన్‌కు అర్హులేనని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ ఒరిజినల్ టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తులు అందజేయా లని పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



గంట్యాడ: అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి

గంట్యాడ: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని స్థానిక ఐసీడీఎస్ పీఓ దోకుల ఉమా భారతి పిలుపునిచ్చారు.నరవ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలతో జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. అలాగే డెంగీ, మలేరియా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం

జామి: మహిళల కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీఓ బి.ఉమ అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కుమరాం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల నిర్మూలన, వ్యక్తిగత పరిశుభ్రత, మహిళల హెల్ప్‌లైన్, బేటీ బచావో,బేటీ పడావో తదితర కార్యక్రమాలపై శనివారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.కృష్ణవేణి అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాల ని సూచించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని అన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎన్. ప్రకాశరావుపట్నాయక్, న్యాయవాదులు పి.శ్రీనివాసరావు, రమణాజీ, సూర్యనారాయణ, కె.సాయిశేఖర్, జె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ధ్యేయం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మానవతా స్వచ్ఛంద సేవ విస్తరాణివృద్ధి కమిటీ కన్వీనర్ రామరాజు, సభ్యులు

గజపతినగరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఉత్తమ సమాజం నిర్మాణమే ఏపీ మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ధ్యేయమని ఆ సంస్థ విస్తరణాభివృద్ధి కన్వీనర్, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఇన్‌చార్జి సాగిరాజు జానకి రామరాజు అన్నారు. పురిటిపెంటలోని మండల వారి కాలనీలో సంస్థ సభ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యాబోధన, పర్యావరణ పరిరక్షణద్వారానవ సమాజ నిర్మాణా స్థాపించవచ్చని తెలిపారు.ప్రతిభావంతులైన విద్యార్థులకు సంస్థ ద్వారా ఆర్థిక సహాయం అందించడం, అనాథ శవాల దహన సంస్కారాలకు సహకరించడం, శీతల శవ పేటికలు అందించడం, తదితర సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.అనంతరం సంస్థ సేవలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మండల సురేష్, రేగ సురేష్, ఆ స్వచ్ఛంద సంస్థ జిల్లా కన్వీనర్ కె.రామకృష్ణరాజు, సభ్యులు సుధాకర్ పట్నాయక్, కర్రి రామునాయుడు, బగ్గాం దామోదర్, జగన్నాధరాజు, ఈదుబిల్లి తిరుపతిరావు,గేదెల సన్యాసిరావు,తామాడ రమేష్, బోని శ్రీను, బి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి ఆర్యవైశ్య సంఘ సమావేశం

వేపాడ: రాష్ట్రస్థాయి ఆర్యవైశ్య సంఘ సమావేశం కొత్తవలస మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పచ్చిపులుసు ఈశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్రస్థాయి ఆర్యవైశ్య సంఘ పెద్దలు రానున్నారని, జిల్లాలోని ఆర్యవైశ్యులు అంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



లైబ్రేరియన్‌కు పుస్తకాలు అందజేస్తున్న శ్రీరామ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

లక్కవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయానికి శ్రీరాంపురం గ్రామానికి చెందిన శ్రీరామ చారిటబుల్ ట్రస్టు వారు రూ.20వేల విలువైన పుస్తకాలు, పుస్తకాల ర్యాక్‌ను సమకూర్చారు.వాటిని లైబ్రేరియన్ నిర్మలకు ఎంఈఓలు సీహెచ్.కూర్మారావు, శ్రీనివాసరావు చేతుల మీదుగా శనివారం అందజేశారు. శ్రీరామ ట్రస్టు చైర్మన్ డాక్టర్ టి.సుబ్బా రావు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ట్రస్టు కార్యదర్శి వేదుల మధురవాణి, న్యాయవాది వి.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు వి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ కృష్ణారావు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్‌ను జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఎం.కృష్ణారావు శనివారం సందర్శించారు. పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ ప్రాజెక్ట్‌లను తిలకించి, వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని, వారిని అభినందించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి



యంత్రంతో వరినాట్లు వేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

శృంగవరపుకోట: సాగులో రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని ఏఓ రవీంద్ర అన్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో రైతులకు యంత్రంతో వరినాట్లు వేసే విధానంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగులో ఖర్చులను తగ్గించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసేలా మిషన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈపద్ధతిలో వరినాట్లు వేయడం వల్ల సమయం ఆదా అవుతుందని, శ్రమ, కూలీల ఖర్చు తగ్గుతుందని, వరుస క్రమంలలో నాట్లు పడడం వల్ల దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. గతేడాది మండలంలో 118 ఎకరాల్లో మిషన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగా, ఈ ఏడాది ఇప్పటికే 142 ఎకరాల్లో నాట్లు వేసినట్లు తెలిపారు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నీలకంఠరావు, తదితరులు

కొత్తవలస: శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తహసీల్దార్ బి.నీలకంఠరావు అన్నారు. కలాం వర్ధంతిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివా రం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని కలాం విగ్రహానికి తహసీల్దార్, రెవెన్యూ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. డిప్యూటీ తహసీల్దార్‌లు తమటపు రమేష్, కోట అప్పారావు, సర్వేయర్ గంగాధర్, ఏఎస్ఓ నగేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

జామి: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో మంచి ఆహార అలవాట్లు పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డీఎంహెచ్ఓ భాస్కరరావు అన్నారు. కుమరాం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాల ప్రాంగణాన్ని, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగామాట్లాడుతూ కౌమార దశలో కొంత మంది బాలికలు రక్తహీనత వంటి సమస్యలు ఎదుర్కొం టారని అన్నారు. విధిగా పౌష్టికాహారం తీసుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చని చెప్పారు. కలుషిత ఆహారం,కలుషిత నీరు, దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. అలమండ పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.వి.ఎస్.పద్మావతి, వెంకటేష్, సీహెచ్ఓ రాజు,హెల్త్‌ఎడ్యూకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్, ఈఓ నారాయణ, కేజీబీవీ ఎస్ఓ శారద, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కొత్తవలస తహసీల్దార్ నీలకంఠరావుకి స్వాగతం పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

కొత్తవలస: మండల తహసీల్దార్‌గా బి.నీలకంఠరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

వేపాడ తహసీల్దార్‌గా సన్యాసినాయుడు



గరివిడి తహసీల్దార్ బంగార్రాజు

వేపాడ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న సన్యాసినాయుడుకు తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

గరివిడి తహసీల్దార్‌గా బంగార్రాజు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి తహసీల్దార్‌గా చింతా బంగార్రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం జిల్లా పెందుర్తి నుంచి బది లీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు గరివిడి మండల టీడీపీ నాయకులు, జిల్లా జైభీమ్ ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

యూనిఫాం, పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు,యూనిఫాం మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్ రామస్వామి, తదితరులు

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీ పరిధి 202 కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన పుస్తకాలు,యూనిఫాం మెటీరియల్‌ను మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి శనివారం పంపిణీ చేశారు.వార్డు మెంబర్లు సూరిబాబు,శ్రీనివాసరావు,హెచ్ఎం పతివాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నీటి పాలైన నువ్వు పంట



మరుపల్లిలో పంట చేనును ఆరబెడుతున్న రైతులు

గజపతినగరం రూరల్: చేతికి అందివచ్చిన నువ్వు పంట అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్నవర్షాలకు పాడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 312 ఎకరాల్లో రైతులు నువ్వు పంట సాగుచేశారు. పలుగ్రామాల్లో రైతులు కోతలు చేసి పంటను నూర్పు చేసేందుకు పొలాల్లో కుప్పలు పెట్టారు. నూర్పులు చేసేలోగా వర్షాలు ప్రారంభం కావడం, వారం రోజులుగా తెరిపివ్వకపోవడంతో పంట చేనుతడిసి కుళ్లిపోయింది. శనివారం కాస్త వర్షం తెరిపివ్వడంతో పొలాల్లో తడిసిన పంట చేనును రోడ్లు, పొలాలు, చెరువు గట్లపైకి తీసుకువచ్చి ఎండబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

కార్మిక,కర్షక, రైతు వ్యతిరేక బడ్జెట్



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం వారు నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరినాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులపై, రైతులపై పెనుభారం పడుతుందని పేర్కొన్నారు. బడ్జెట్లో కార్పొరేటర్లకు వేల కోట్ల రూపాయల రాయితీలు కల్పిస్తూ, ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించారని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులను పెంచకపోవడం వల్ల భవిష్యత్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ కష్టమేనని అభిప్రాయపడ్డారు. ఎరువుల మీద సబ్సిడీని తగ్గించడం వల్ల రైతులపై భారంపడుతుందన్నారు. రాష్ట్ర విభజన హామీలను పక్కనపెట్టారని,వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు కేటాయించలేదని, అమరావతి నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లను గ్రాంటు రూపంలో కాకుండా అప్పుల రూపంలో ఇవ్వడం దారుణమని అన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ కూటమిలో భాగంగా ఉన్న టీడీపీ, జనసేనపార్టీలు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై మాట్లాడడం లేదని, కేంద్రంతో పోరాడి ,రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టేలా కృషి చేయాలని కోరారు. మండల పెన్షనర్ల సంఘం కార్యదర్శి ఓ.ఎస్.ఎన్.మూర్తి, పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.